క్లుప్తంగా

వీరేశ్వరస్వామి సన్నిధిలో..



గురునాథరావుని సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: తాడువాయి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు జెట్టి గురునాధరావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం శేషవస్త్రాలతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పాపోలు వెంకటేశ్వరరావు, సర్పంచ్ యరమాల సత్యవతి, మాజీ ఎంపీటీసీ సత్రం లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా గంగాధరరావు, కనికళ్ల ప్రసాద్ బాబు, ఓరుగంటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి

జంగారెడ్డిగూడెం: మూఢ నమ్మకాలను వ్యతిరేకిస్తూ, స్త్రీ విద్యకై అలుపెరుగని పోరాటం చేసిన యోధురాలు సావిత్రిబాయి పూలే అని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం ప్రజా వైద్యశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ కోట సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌జేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, మైనారిటీ నాయకులు షేక్ ముస్తఫా, పి.ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ కుర్మయ్య తదితరులు సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

19 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

టి.నరసాపురం: విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు బొర్రంపాలెంలో జె.కరుణ్‌కుమార్ గుప్తా ఇంటిపై ఆదివారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కరుణ్‌కుమార్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 19 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. అతనిపై 6ఎ, 7(1) కేసు నమోదు చేస్తున్నట్లు విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్‌కుమార్ తెలిపారు. ఈ దాడిలో టి.నరసాపురం సివిల్ సప్లయిస్ డీటీ ఉదయ్, వీఆర్వో ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

శివదేవుని గ్రామోత్సవం

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో శివయ్యకు త్రిశూల స్నానాన్ని అట్టహాసంగా జరిపారు. అనంతరం రుద్రాక్ష మండప వాహనంలో గంగా, పార్వతీ సమేత శివదేవుని గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి వసంతోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. రాత్రి ఆలయంలో స్వామివారికి 21 చుట్లు పల్లకీ సేవ నిర్వహించారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

టి.నరసాపురం: గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ప్రధానంగా టి.నరసాపురం అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో వేలాది మంది భక్తులకు ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్వతనేని మురళి, పసుమర్తి రాము తదితరులు పర్యవేక్షించారు.

అంకాలగూడెంలో పూజలు

కొయ్యలగూడెం: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా అంకాలగూడెం శ్రీ ఉమా సమేత భోగ లింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం హోమ పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి శివానంద ఆచార్యుల పర్యవేక్షణలో త్రిశూల స్నానం, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ నిర్వహించగా హోమ పూజల్లో భక్త దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉమా సమేత భోగలింగేశ్వరునికి పుష్పోత్సవం, ఊంజల్ సేవ సాయంత్రం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

జంగారెడ్డిగూడెం రూరల్: పట్టిన్నపాలెంలో అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన కోట రామకృష్ణ కుటుంబానికి సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి పంచాయతీ ద్వారా ఆర్థిక సహాయం, బియ్యాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ నూతన మండల కమిటీ

కుక్కునూరు: కుక్కునూరులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సరియం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పైదా పరమేష్, కోశాధికారిగా వెట్టి వెంకన్న, సహాయ కార్యదర్శిగా కొవ్వాసి నాగార్జునలను నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు, పాయం సత్యనారాయణ, కుంజా రమేష్, నాయకులు బిట్టా శివ, కుంజా నరసింహారావు, కుంజా వెంకటనర్సయ్య, అశోక్, బసవరాజు, జిల్లా నాయకులు కొమరం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

- పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయరాజు
- ధర్మాజీగూడెంలో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న కంభం విజయరాజు



పాల్గొన్న బూత్ కన్వీనర్లు, సభ్యులు

లింగపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి బూత్ కన్వీనర్లు, సభ్యులు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. పార్టీ లింగపాలెం మండల బూత్ కన్వీనర్లు, సభ్యులతో ఆదివారం ధర్మాజీగూడెంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల సంగ్రామంలో నీతి నిజాయతీకి పట్టం కట్టేలా ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వివరించారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలైనా చేస్తాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జగన్ పాలనలో ప్రతి అంశాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎన్నికలు జరిగే వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త నిరంతరం శ్రామికుడిలా, యోధుడిలా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. మీకు మంచి చేస్తేనే నాకు ఓటు వేయండి అని ధైర్యంగా చెప్పగలిగిన నాయకుడు జగన్‌మోహనరెడ్డి అని, అటువంటి నాయకుడు నిరంతరం ప్రజల కోసం సేవచేయాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత బూత్ కమిటీ సభ్యులు, కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీ రీజనల్ కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, నియోజకవర్గ పరిశీలకులు ఎం.సూర్యన్నారాయణ, జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్ రాజు, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, లిడ్ క్యాప్ డైరెక్టర్ సాంగా సందీప్, పార్టీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, మండల బూత్ కన్వీనర్ ఉప్పలపాటి గోపి, సొసైటీ చైర్మన్లు ఉప్పలపాటి వరప్రసాద్, రెడ్డిన శ్రీను, సర్పంచ్‌లు చలగుళ్ల రవిబాబు, ఇనుగంటి రాజేష్‌బాబు, ఎస్.ప్రసాద్, నాయకులు ఇనుగంటి సతీష్, నూతలపాటి శ్రీను, ముల్లపూడి సుమన్, చల్లా గంగాధరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ వెళ్లండి

చింతలపూడి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వెళ్లి వివరించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో మండల బూత్ కన్వీనర్లతో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ మీకు మంచి చేస్తేనే నాకు ఓటు వేయమని లేకపోతే వద్దని ధైర్యంగా చెప్పిన ముఖ్యమంత్రి దేశంలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోకపోతే రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోతుందని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి కుటుంబాన్ని కలిసి అభివృద్ధి పనులపై అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకమైందని ప్రతి నిమిషం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలపడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ బూత్ కన్వీనర్ బీవీఆర్ చౌదరి, ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, చింతలపూడి జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు సోదరి పొన్నాల అనిత, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ ఆది విష్ణు, సర్పంచ్ ఆర్‌వీ రామారావు, ఎంపీటీసీలు గుత్తా కిషోర్, కలకొండ రామారావు, సొసైటీ అధ్యక్షుడు గిరి భోగారావు, కె గోవర్ధనరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చేపూరి ఖాదర్‌బాబు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

కుక్కునూరు: వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని కుక్కునూరు ఎస్సై ఎస్.రామక్రిష్ణ అన్నారు. ఆదివారం కుక్కునూరులో నిర్వహించిన వాహన తనిఖీలలో భాగంగా ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వాహనానికి సంబంధించిన పేపర్లు కలిగిఉండాలని, బైక్‌లపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వెహికల్ చట్టాలను ఉల్లంఘిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గర్భాశయ కణితి తొలగింపు



శస్త్రచికిత్స చేసి తొలగించిన కణితి

జంగారెడ్డిగూడెం: మహిళ గర్భాశయంలో ఏర్పడిన కణితిని ఆదివారం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం గ్రామానికి చెందిన బత్తుల ప్రమీల గర్భాశయ కణితితో ఇబ్బంది పడుతూ ఏరియా ఆస్పత్రికి వెళ్లింది. ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం ఆసుపత్రి వైద్యులు వజ్రకిరణ్‌తో కలిసి ఆదివారం శస్త్రచికిత్స చేసి 3 కేజీల గర్భాశయ కణితిని తొలగించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల చెప్పారు.

శ్రీరామ జప యజ్ఞంలో పూర్ణాహుతి



భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తున్న భారతి స్వామి

కొయ్యలగూడెం: యజ్ఞ యాగాదులు, హోమాల నిర్వహణ వల్ల సర్వేజనా సుఖినోభవంతుగా కాలం విరాజుల్లుతుందని యాజ్ఞవల్క రామాశ్రమ పీఠాధిపతి(ముండూరు) శ్రీ కృష్ణ శరణానంద భారతి స్వామి పేర్కొన్నారు. ఆదివారం బయ్యనగూడెం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీరామ జప యజ్ఞ పూర్ణాహుతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హైందవి ఫౌండేషన్, హిందూ చైతన్య సమ్మేళన మహోత్సవ్‌తో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు కరపత్రాలను పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిపాలన చేస్తుందని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. లక్కవరంలో ఆదివారం ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రస్తుత ప్రభుత్వంలో పొందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. సంక్షేమమే లక్ష్యంగా పాలన అందించిన వైఎస్సార్ సీపీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు మళ్లీ పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, సచివాలయ కన్వీనర్ శ్రీదేవి, చిట్టిబొమ్మ శివరామకృష్ణ, నిమ్మ రామకృష్ణ, సల్ల రామకృష్ణ, గృహసారథి ఆళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణాంకాలతో సహా అభివృద్ధిని చూపిస్తున్నాం..

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



సరిపల్లిలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి

కొయ్యలగూడెం: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో వెనుకబడి ఉందంటూ గాలి కబుర్లు మాట్లాడే వారికి.. చేసిన అభివృద్ధిని గణాంకాలతో చెబుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తగు రీతిలో సమాధానం ఇస్తోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. సరిపల్లి గ్రామంలో ఆదివారం పీఏసీఎస్ అధ్యక్షురాలు మందపాటి శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నపోతు ఈనింది అంటూ పచ్చ మీడియా ప్రచారానికి టీడీపీ, జనసేనలు తగుదున్నమ్మా అంటూ దూడను కట్టేయండి రా అంటూ అజ్ఞానాన్ని ప్రదర్శిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కళ్లుండి చూడలేని ప్రతిపక్షాలకు పొరుగు రాష్ట్రాల వారు వచ్చి రాష్ట్ర అభివృద్ధిని పరిశీలిస్తుండటం చూసి సిగ్గు తెచ్చుకోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 58 నెలల పాలనలో దాదాపు 24 నెలలు కరోనా కష్టకాలంతోనే గడిచాయని, ఆ సమయంలో ఇతర రాష్ట్రాలు దుర్భర పరిస్థితి ఎదుర్కొనగా ఆంధ్రప్రదేశ్ జగనన్న సంక్షేమ పథకాలతో బయటపడింది అని వివరించారు. నవరత్నాల పథకాలతో లబ్ధి చేకూరని కుటుంబం లేదనీ, సంక్షేమ పథకాల అమలుకాని ఇల్లు లేదని బాలరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని రూ.23.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.40 లక్షలతో నిర్మించిన రైతు గోడౌన్, రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను బాలరాజు, రాజ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. రైతుల శ్రేయస్సు కొరకు మల్టీపర్పస్ గోడౌన్ నిర్మాణం చేసినందుకు సొసైటీ పాలకవర్గం బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపింది. ఐదువందల మెట్రిక్ టన్నుల సరుకులు గోడౌన్‌లో సంరక్షించుకోవచ్చు అన్నారు. ముందుగా డ్వాక్రా గ్రూపు మహిళలు బాలరాజు దంపతులను సన్మానించారు. గతంలో బాలరాజు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్న విధంగా డ్వాక్రా రుణాలు మాఫీ చేసినందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీటీసీ బండి సీతారత్నం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దగ్గు సత్తిబాబు, తోట జయబాబు, కంభంపాటి బుజ్జిబాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దూలపల్లి కాంతారావు, బండి కోటేశ్వరరావు సర్పంచ్‌లు పసుపులేటి రాంబాబు, లింగిసెట్టి అనంతలక్ష్మి, సున్నం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



మఠంగూడెంలో వైఎస్సార్ సీపీ నేతలతో మాట్లాడుతున్న మోషేన్‌రాజు

లింగపాలెం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని మళ్లీ సీఎంను చేసేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. లింగపాలెం మండల మఠంగూడెం గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు మండలపు సత్యన్నారాయణను ఆదివారం మోషేన్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పార్టీ నేతలు కొందరు మోషేన్‌రాజును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి పాలనలో అందించిన సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష అని అన్నారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కుతుందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందించారని, అటువంటి నాయకున్ని మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైఎస్సార్ సీపీలో ఉన్నవారంతా ఒక కుటుంబ సభ్యులని కార్యకర్తలు, నాయకుల్లో చిన్న చిన్న మనస్పర్థలు ఉన్నా వాటన్నింటిని పక్కనపెట్టి పార్టీ విజయానికి కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. చింతలపూడిలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి వైఎస్ జగన్‌కు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, భోగోలు సర్పంచ్ తాడేపల్లి శాంతరావు, నాయకులు రావి కొండయ్య, ఇనుగంటి సతీష్, మండలపు నరిశింహరావు, కర్లపూడి ఆనంద్, యలమంచిలి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం



సరిపల్లి ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి

కొయ్యలగూడెం: అభివృద్ధిని అడ్డుకుంటున్న సైంధవులకు ప్రజలు బుద్ధి తెలిపే సమయం ఆసన్నమైందని.. ఈ ధర్మయుద్ధంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయం అని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం సరిపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 2009 ఎన్నికలలో మహానేత వైఎస్సార్ దుష్ట చతుష్టయాన్ని ఎదుర్కొని మట్టి కరిపించారనీ, ఇప్పుడు కూడా జననేత జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి చెందిన కలియుగ కౌరవులను అంతమొందించడం ఖాయం అని జోస్యం పలికారు. ప్రతి పల్లె, పట్టణం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్న రుణం తీర్చుకోవడానికి ఆత్రుతతో ఎదురుచూస్తున్నాయని, బిల్లా, రంగాలైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను నమ్మే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. ఐదు పదులు నిండని జగనన్నను ఎదుర్కోవడానికి ఐదు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు చేస్తున్న నీతిమాలిన రాజకీయాలకు తోకగా, తోడుగా నేనున్నాను అంటూ పవన్ కళ్యాణ్ మారారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల పొత్తుల ప్రభావం ఉందని అన్నారు.

సమన్వయ కమిటీ విస్తరణ

పోలవరం నియోజకవర్గ రాజకీయ కేంద్రమైన కొయ్యలగూడెం మండలంలో వైఎస్సార్‌సీపీ మరింత పటిష్టతకు ప్రస్తుతం ఉన్న సమన్వయ కమిటీని విస్తరిస్తున్నట్లు బాలరాజు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, ఎంపీటీసీ గంట శ్రీనులను కూడా కమిటీలోకి తీసుకున్నామని మొత్తం తొమ్మిది మందికి మండల సమన్వయ బాధ్యతలను అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, సమన్వయ కమిటీ సభ్యుడు మంతెన సోమరాజు, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్య, బాలం వెంకటరామయ్య, మందపాటి రామకృష్ణ, మద్దు సతీష్, తాడేపల్లి మధు, యర్రంశెట్టి గంగరాజు, మల్లాపు పుల్లయ్య, మన్యం రమణ, మార్గాని మంగారావు, సిరిబత్తుల పోసి, నులకానీ ఉమా, నులకాని సతీష్, రామిని మంగు, జన్నే రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు



సీతానగరంలో కార్యకర్తలతో పరిచయ కార్యక్రమంలో విజయరాజు

చింతలపూడి: ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకంలో లబ్ధి చేకూరిందని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో ఆదివారం ఆయన కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. ఎంపీటీసీ కె రామారావు మాట్లాడుతూ గ్రామంలో మిగిలి ఉన్న సమస్యలను విజయరాజు దృష్టికి తీసుకువచ్చారు. ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని, గ్రామంలో శ్మశానవాటికకు స్థలం కేటాయించి అభివృద్ధి చేయాలని, జిల్లా పరిషత్ నిధులతో ఆంధ్ర, తెలంగాణ మధ్య సీసీ రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉందని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై స్పందించిన విజయరాజు తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డా బి రాంబాబు నాయక్, చింతలపూడి జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, సర్పంచ్ గాయం మల్లీశ్వరి, చింతంపల్లి సర్పంచ్ తాండ్ర రామకృష్ణ, వెంకటాద్రిగూడెం సర్పంచ్ ఆర్‌వీ రామారావు, ఎంపీటీసీ కృష్ణారావు, పార్టీ చింతలపూడి పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎం దుర్గారావు, జి రాజేష్‌నాయుడు, గోలి చంద్రశేఖర్‌రెడ్డి, కె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తి ఆత్మహత్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామానికి చెందిన చిట్టూరి పవన్‌కుమార్ జంగారెడ్డిగూడెంలోని పామాయిల్ ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. జంగారెడ్డిగూడెంతో పాటు, మైసన్నగూడెంలో తెలిసిన వారి నుంచి డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. అప్పులు తీర్చలేక, ఇంట్లో వారికి చెప్పలేక ఈ నెల 7వ తేదీ రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న అతడిని జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 9వ తేదీ రాత్రి పవన్‌కుమార్ మృతిచెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, పవన్‌కుమార్ భార్య చిట్టూరి భార్గవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేత్రపర్వం.. సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయస్వామి వారి పూర్వాభాద్ర జన్మ నక్షత్రం పురస్కరించుకుని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఆదివారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని వీక్షించి తరించారు. అలాగే మాఘ మాస ఆఖరి ఆదివారం కావడంతో శుక్ల యజుర్వేదం, అదర్వణ వేద పండితులు సూర్యనమస్కారాలు నిర్వహించారు. స్వామివారిని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్రన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ సిబ్బంది శేషవస్త్రాన్ని కప్పి సత్కరించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జెడ్పీ హైస్కూల్‌లో కలిసిన 1988-89 నాటి బ్యాచ్ విద్యార్థులు

కుక్కునూరు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1988–89వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ రావుమీనా వినోద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రసన్నకుమార్, వెంకటరెడ్డి, అటెండర్ మురళిలను శాలువాలతో సన్మానించి, మొమెంటో అందజేశారు. పూర్వవిద్యార్థులు చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు నిర్మల సంతోష్, రావు వినోద్, కుక్కునూరు మురళి, రావు శ్రీనివాసరావు, పూటుకూరి రవి, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరేశ్వరస్వామి కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: మహా శివరాత్రి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా తాడువాయి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి క్షేత్రంలో ఆదివారం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పల్లకీసేవ జరిపారు. భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వీక్షించి తరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.